VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ ఆదివారం 11 జనవరి 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 141
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


2లో..

## మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్




# వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు

**సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలి**
**ఫెలోస్ ఇండియా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్:** ప్రజలు, సమాజంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని.. అయితే, ప్రజల నాడి పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం సూచించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపర చడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు.. వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలరని సీఎం అభిప్రాయపడ్డారు.

తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ.. సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాణా లను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని సీఎం అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ ఉండాలని సీఎం ఆకాంక్షించారు.




# పాలమూరుకు జాతీయ హెూదా ఇవ్వాలి

- తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి
- ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి
- హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాఉటకు సహకరించండి
- మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి

తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది.


2లో..

2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము.


2లో..

## వరుసగా రెండోరోజూ పెరిగిన రద్దీ

హైదరాబాద- విజయవాడ మధ్య వాహనాలు బారులు
ప్రత్యామ్నాయా రూట్లలో వెల్లాలని పోలీసుల సూచన


2లో..


## అదుపులోకి వచ్చిన బ్లో ఔట్

పూర్తిగా ఆగిపోయిన మంటలు
స్వదేశీ పరిజ్ఞానంతోనే అదుపుచేసిన ఓఎన్‌జిసి
ఊపిరి పీల్చుకున్న చుట్టుపక్కగ్రామాల ప్రజలు

## హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు



2లో..


2లో..

## భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలు

## మాజీ ఐపిఎస్ భార్యకు టోకరా


2లో..

**రూ.2.58 కోట్లు కొల్లగొట్టిన సైబర్ మోసగాళ్లు**

**ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు**

వాట్సప్‌లో నకిలీ సెబీ సర్టిఫికెట్లు పంపించారు. దీంతో సైబర్ నేరగాళ్ల ప్రకటనలు నమ్మి, డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5వరకు మాజీ ఐపీఎస్ భార్య లావాదేవీలు నిర్వహించారు. మొత్తం 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్లు పెట్టుబడి పెట్టించారు.

# బంగ్లాలో ఆగని దాడులు




**దుండగుల దాడిలో మరో హిందువు హత్య**

ఢాకా: కొంత కాలంగా బంగ్లాదేశ్ లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల్లో భాగంగా మరో హిందువు కన్నుమూశాడు. సునమ్‌గంజ్ జిల్లాలో ఓ అల్లరి మూక చేతుల్లో జై మహాపాత్రో అనే హిందువు ప్రాణాలు కోల్పోయాడు. ఈ హత్యోదంతం తీవ్ర కలకలం రేపుతోంది. మీడియా కథనాల ప్రకారం.. సునమ్‌గంజ్ జిల్లాలో జరిగిన భంగాడోహోర్ గ్రామంలో ఆర్థిక లావాదేవీల అంశాన్ని ఆధారంగా చేసుకొని గురువారం 19 ఏళ్ల జై మహాపాత్రపై అమీరుల్ ఇస్లాం అనే వ్యక్తితోపాటు మరికొంత మంది దాడి చేశారు. ఈ దాడిలో మహాపాత్రో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. హత్య వార్త తెలియగానే స్థానిక హిందూ సమాజం, మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ఢాకాలోని పలు ప్రాంతాల్లో శనివారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'జై మహాపాత్రోకు న్యాయం ' కావాలంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్య అనంతరం దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. 35 రోజుల్లో 11 మంది హిందువుల చనిపోయినట్లు సమాచారం.


2లో..

## సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

# మేడారం జాతరలో పక్కాగా ఐవద్య సౌకర్యం



**భక్తులకు తక్షణ సేవలు అందించేలా ప్రణాళిక**

**జాతరలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా మెడికల్ క్యాంపులు**

**వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం**

హైదరాబాద్: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

# మహిళా ఐఎఎస్‌పై తప్పుడు కథనాలు తగవు

**ఇలాంటి కథనాలతో ఆత్మస్థయిర్యం దెబ్బతీయవద్దు**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు**



హైదరాబాద్: తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నించారు. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిదని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్. 'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందన్నారు. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చేదేమీ లేదు. పేర్ల మార్పునకు ముందు ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

**అమెరికా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం**

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ తాజాగా వెల్లడించింది. కొత్త రేట్స్ మార్చ్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. హెచ్-1బీ, ఎల్-1 సహా పలు రకాల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును చార్జ్ చేస్తుంటుంది. హెచ్-1బీ లాంటి వీసాల విషయంలో గతంలో 2,805 డాలర్లుగా ఉన్న ప్రీమియం ఫీజు ప్రస్తుతం 2,965కి పెరిగింది. విదేశీ ఉద్యోగుల వీసా దరఖాస్తు పరిశీలనను వేగవంతం చేసేందుకు అమెరికా సంస్థలు ఈ ఫీజును చెల్లిస్తుంటాయి. ఇక ఎఫ్-1, జే-1వంటి వీసాల ప్రీమియం ఫీజు కూడా 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెరిగింది. 2023 జూన్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ పేర్కొంది. జాబ్స్ మారే వారు, వీసాలను రెన్యూవల్ చేసుకునే విదేశస్తులపై ఈ పెంపు భారం పడనుంది. ఫీజు పెంపుతో వచ్చే అదనపు నిధులతో తమ కార్యకలాపాలను మరింత సరళతరం చేసేందుకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్స్ తగ్గడంతో పాటు వీసా దరఖాస్తుల పరిశీలన ఇతర సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పింది. వీసా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు సరిదిద్దడమే
తమ లక్ష్యమని కూడా వెల్లడించింది. వలసల కట్టడికి ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వివిధ మార్గాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చిక్కులు తప్పవని ఇటీవల భారతీయ ఎంబసీ ఎక్స్ వేదికగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

## మాజీ ఐపిఎస్ భార్యకు టోకరా


హైదరాబాద్: పెట్టుబడుల పేరుతో మాజీ ఐపీఎస్ అధికారి భార్యకు సైబర్ నేరగాళ్లు వలవేసి, దాదాపు రూ.2.58 కోట్లు కొల్లగొట్టారు. స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామంటూ తొలుత వాట్సప్ సందేశం పంపించారు. ఆమెకు అవగాహన లేకపోకవడంతో.. తన భర్త నెంబరును ఆ వాట్సప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. స్టాక్స్‌లో 500శాతం లాభాలు వస్తాయని, ఇది సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని నమ్మించారు. వాట్సప్‌లో నకిలీ సెబీ సర్టిఫికెట్లు పంపించారు. దీంతో సైబర్ నేరగాళ్ల ప్రకటనలు నమ్మి డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5వరకు మాజీ ఐపీఎస్ భార్య లావాదేవీలు నిర్వహించారు. మొత్తం 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్లు పెట్టుబడి పెట్టించారు. ఇన్వెస్ట్‌మెంట్ ఆపడంతో మళ్లీ పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. పెట్టుబడి పెట్టకుంటే ఇప్పటి వరకు పెట్టిన డబ్బు పోతుందని ఆమెను బెదిరించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి భర్త గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించినట్టు సమాచారం. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.?

## మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**రూ.3వేల కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ భూమి స్వాధీనం**

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రూ.3వేల కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. మక్తా మహబూబ్ పేటలోని సర్వే నెంబరు 44లో తప్పుడు పత్రాలతో 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 159 సర్వే నెంబర్‌లోని భూమి పత్రాలతో సర్వే నెం.44లోని ప్రభుత్వ భూమిలో ఇప్పటికే ఎకరంన్నర వరకు ఇమ్రాన్ అనే వ్యక్తి కబ్జా చేయగా అతనిపై కేసు నమోదైంది. అలాగే మరో 5 ఎకరాలను కూడా ఆక్రమణల చెర నుంచి హైడ్రా
విడిపించింది. మియాపూర్ - బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా చెరువు కట్టపై 200 మీటర్ల మేర మట్టి పోసి ఏర్పాటు చేసిన 18 షెట్టర్లను కూడా హైడ్రా తొలగించింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సర్వే నెం.44లోని ప్రభుత్వ భూమిపై విచారణ జరిపించారు. అందులోని అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూమిపై పడిందని నిర్ధారించిన హైడ్రా అధికారులు.. సమగ్ర విచారణ జరిపి మక్తా మహబూబ్ పేటలోని ఆ భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెట్టారు.

## భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలు
## విచారణకు లోకాయుక్త ఆదేశం




హైదరాబాద్: భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలపై విచారణకు లోకాయుక్త ఆదేశించింది. సుమోటోగా కేసు నమోదు చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. భూభారతి చట్టాన్ని వాడుకుని ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. జనగామ జిల్లా కేంద్రంలో ఒకే రోజు రూ.8 లక్షల రూపాయల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పక్కదారి పట్టించిన ఘటన బయటకు రావడంతో లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. భూ భారతిలో జరిగే కుంభకోణానికి సీసీఎల్ఏ టెక్నికల్ టీమ్ సహకరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ భూ పరిపాలన శాఖ చీఫ్ కమిషనర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ, మీ సేవ కమిషనర్, జనగామ జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

# వరుసగా రెండోరోజూ పెరిగిన రద్దీ



హైదరాబాద్:సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. వరుసగా రెండో రోజు శనివారం ఉదయం హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ఎ÷-లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా
వెళ్లాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక కూడళ్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది. ప్రతి ఆదివారం చౌటుప్పల్‌లో సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమం అని పోలీసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు ఒక గంటలో చేరుకోవచ్చు కానీ.. నిరుడు 'భోగి' ముందు రోజు 3 నుంచి 4 గంటల సమయం పట్టింది. అంతకు 2 రోజుల ముందు కూడా చాలా సమయం పట్టింది. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతుండటంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడే బదులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లడం మేలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్,

పంతంగి టోల్‌ఎ÷-లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని.. నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని.. వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

# పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి




న్యూఢిల్లీ: తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయన
తెరాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నమ్ముతున్నానని భట్టి అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను
ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌బిఆర్‌ఎం పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎంఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. పెద్దపల్లి,
వరంగల్,
ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఘనంగా ముగిసిన ఆవకాయ అమరావతి ఉత్సవాలు

**రెండ్రోజుల పాటు ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**




విజయవాడ: విజయవాడలోని పున్నమి ఘాట్‌లో రెండో రోజు ఆవకాయ అమరావతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సినిమా, సంస్కృతి, సాహిత్యాల సమ్మేళనంగా కొనసాగిన ఈ ఉత్సవాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణానది తీరంలో నిర్వహించిన సాంస్కృతిక
కార్యక్రమాలు ఉత్సవ వాతావరణాన్ని మరింత సొగసుగా మార్చాయి. సంగీతం, నృత్య ప్రదర్శనలతో పాటు సినీ సాహిత్యంపై జరిగిన చర్చలు మంచి స్పందన పొందాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు పున్నమి ఘాట్‌ను కళా, సాంస్కృతిక వేదికగా నిలిపాయి. ఈ కార్యక్రమాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీకళ తదితరులు హాజరై కళాకారులను అభినందించారు. కాగా, రాష్ట్ర సంస్కృతి, వంటకాలు, సృజనాత్మక రంగాలను ప్రోత్సహించేలా ఈ ఫెస్టివల్‌లో 28 ప్రత్యేక ఈవెంట్లు, 4 వర్క్‌షాప్‌లు నిర్వహించారు.. ప్రపంచంలో ఫుడ్ అంటే భారతదేశం.. భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తుకు వచ్చే స్థాయికి మన వంటకాలకు ఖ్యాతి ఉంది అంటూ ఆంధ్ర వంటల గొప్పదనాన్ని సీఎం చంద్రబాబు.. ఈ ఉత్సవాల ఆరంభంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఉత్సవాలు, సంబరాలు లేక ప్రజల్లో నవ్వులు కూడా కరువయ్యాయని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్, అమ్మవారి దసరా ఉత్సవాలను ప్రపంచస్థాయిలో నిలబెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు దసరా అంటే విజయవాడ గుర్తుకు వచ్చేలా ఉత్సవాలు నిర్వహించాం అని చెప్పారు. ఇక, తెలుగు సినీ చరిత్ర గురించి ప్రస్తావించిన సీఎం చంద్రబాబు.. భక్త ప్రహ్లాద నుంచి బాహుబలి వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో ప్రయోగాలు చేసింది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణాజిల్లా నుంచే వచ్చి సినిమా రంగానికి దిక్సూచిగా నిలిచారు..

## అదుపులోకి వచ్చిన బ్లో ఔట్

కోనసీమ: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది. బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ
నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఔట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు శనివారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

## సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

**సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో ప్రాల్గొననున్న మోడీ**



అహ్మదాబాద్,: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాజ్‌కోట్‌లోని హీరసర్ విమానాశ్రయానికి శనివారంనాడు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి కుంవర్జీ బావలియా, రాజ్‌కోట్ మేయర్ తదితరులు ప్రధాని సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సోమనాథ్‌కు ప్రధాని బయలుదేరారు. ప్రధాని తన పర్యటనలో ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొనున్నారు. అనంతరం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు.
సోమనాథ్ ఆలయంపై 1026లో గజనీ మహ్మద్ దాడి చేసి విధ్వంసం చేశాడు. పలువురు విదేశీ పాలకులు కూడా ఆలయంపై దాడి చేసి దోచుకున్నారు. అప్పట్నించి ఆలయ పునరుద్ధరణ పనులతో సోమనాథ్ ఆలయం తన వైభవాన్ని చాటుకుంటూనే ఉంది. అయితే మొదటిసారి జరిగిన దురాగతానికి వెయ్యేళ్లు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈనెల 8 నుంచి 11 వరకూ వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది సాధువులు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆలయ ఆవరణలో జరిగే 72 గంటల ఓంకార (క్షప) ఉచ్ఛరణ కార్యక్రమంలో పాల్గొనున్నారు. సాయంత్రం ఉత్సవాల్లో భాగంగా డ్రోన్ షో, మంత్ర పఠనం ప్రత్యేక ఆకర్షణలు కానున్నారు.సర్దార్ పటేల్ సారథ్యంలో 1951లో ఆలయ పునర్మిర్మాణం జరిగి భక్తుల సందర్శన కోసం తలుపులు తెరుచుకున్నారు. 2026లో 75వ వసంతానికి చేరుకోవడంతో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 'భారతీయ నాగరికత అజేయ సంకల్పం, బలానికి గొప్ప నిదర్శనం సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం. మన ఆధ్యాత్మిక సంప్రదాయానికి శక్తివంతమైన చిహ్నం. సంపూర్ణ విశ్వాసం, ఉత్సుకత, భక్తితో యావద్దేశం స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను జరుపుకొంటోంది' అని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.సోమనాథ్ ఉత్సవాల్లో భాగంగా జనవరి 11వ తేదీ ఉదయం 9.45 గంటలకు జరిగే శౌర్యయాత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనున్నారు. సోమనాథ్ ఆలయాన్ని శతాబ్దాలుగా కాపాడుకుంటున్న యోధుల సంస్మరణగా ఈ శౌర్యయాత్ర నిర్వహిస్తున్నారు. ధైర్యం, త్యాగం, శౌర్యానికి ప్రతీకలుగా 108 అశ్వాలు ఈ యాత్రలో పాల్గొంటాయి. సాయంత్రం జరిగే ఓంకార మంత్రోచ్ఛరణ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొంటారు. ఆలయ చరిత్ర, భారతదేశ సమున్నత ఆధ్యాత్మిక విలువలపై జరిగే పబ్లిక్ ప్రోగ్రాంలో ఆయన ప్రసంగిస్తారు.

## తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న జనసేన**

హైదరాబాద్:తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది. శనివారం ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ, రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, తెలంగాణలోని సాధ్యమైనన్ని మున్సిపల్ స్థానాల్లో జనసేన అభ్యర్థులను బరిలోకి దించుతామని పార్టీ స్పష్టం చేసింది. ఇందుకోసం పార్టీ ఇప్పటికే తన కార్యచరణను ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న జనసైనికులు, వీరమహిళలు ఈ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల ద్వారా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, ఆయన భావజాలాన్ని తెలంగాణలోని ప్రతి ఇంటికీ చేరవేయడమే ప్రధాన ఉద్దేశ్యమని జనసేన వెల్లడించింది. పవన్ కళ్యాణ్ కి తెలంగాణ ప్రాంతం పట్ల ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని ప్రజలకు వివరించి, రాష్ట్రంలో ఒక సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే ఈ పోటీ వెనుక ఉన్న అసలు లక్ష్యమని పార్టీ తన ప్రకటనలో వివరించింది. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన ఎంట్రీ ఇవ్వడంతో తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారనున్నాయి.

వేగుచుక్క

# జనం మేలు కోరే..
# "వేగుచుక్క" మరింత వెలగాలి.





వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆకాంక్ష.
- చిన్న పత్రికలు నడపడం అభినందనీయం.
- సమాజ నిర్మాణంలో డిజిటల్ పత్రికలదీ కీలక పాత్ర అని వెల్లడి.
- న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ.

జనం మేలు కోరుతూ, ప్రజా చైతన్యం కోసం వార్త కథనాలు అందిస్తున్న "వేగుచుక్క" మరింత వెలగాలనీ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. వేగుచుక్క న్యూస్, డిజిటల్ తెలుగు డైలీ రూపొందించిన 2026 న్యూ ఇయర్ క్యాలెండర్ ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా శనివారం ఆవిష్కరించారు. క్యాలండర్ ను అందంగా రూపొందించడంపై ప్రశంసించారు. గత ఐదేళ్లుగా వేగుచుక్క పత్రిక అందిస్తున్న వార్తా కథనాలపై ఎమ్మెల్యే ఆసక్తితో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పత్రికలను నడపడం ఎంతో కష్టసాధ్యమని, వ్యయ ప్రయాసలను భరిస్తూ, విలువలతో కూడిన కథనాలు అందిస్తూ, ప్రజా చైతన్యం కోసం పత్రికను నడపడం గొప్ప విషయం అన్నారు. సమాజానికి మంచి వార్తలను చేరవేయాలనే ఉద్దేశంతో వేగుచుక్క యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. మంచి పని చేసే వారికి తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే ధన్‌పాల్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేగుచుక్క సీఈఓ కుంచె వెంకటేష్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు చింతల గంగదాస్, బైర శేఖర్, సుంకరి రాజేష్, సిరిగాద ప్రసాద్ (చట్టం), రామచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందూరు నగర అభివృద్ధి తన లక్ష్యం.



అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ. ఎమ్మెల్యే కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

ఇందూరు నగర అభివృద్ధి తన లక్ష్యం అని, అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం తగదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో చేపడుతున్న పలు కీలక అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అమృత్--2 పథకం కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మరియు మ్యాన్‌హెూల్స్ పనులను నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వాటర్ వర్క్స్ అండ్ వాటర్ ట్యాంకుల పనులు, నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన అన్ని నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. టియుఎఫ్ఐడిసి ఫండ్ (60 కోట్లు) తో ప్రతి డివిజన్‌కు కోటి చొప్పున అభివృద్ధి మరియు మరమ్మతు పనుల కోసం టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, కల్వర్ట్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రామర్తి చెరువు సుందరికరణ పనులను వేగవంతం చేసి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా అవసరాలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని, బాధ్యతాయుతంగా, చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు మరియు అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, ఇంచార్జి మున్సిపల్ ఈఈ నగేష్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఈ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సంజీవ్ రెడ్డినీ పరామర్శించిన డాక్టర్ కవిత రెడ్డి.

వేగుచుక్క న్యూస్:నిజామాబాద్



జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాధరి సంజీవ్ రెడ్డినీ జిల్లా కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కవిత రెడ్డి పరామర్శించారు. గాధరి సంజీవ్ రెడ్డి సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, శనివారం వారి నివాసానికి వెళ్లిన డాక్టర్ కవిత రెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ దుఃఖకర సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, ఇలాంటి కష్టకాలంలో అందరూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

# విద్యా సంస్థల్లో కౌన్సిలర్‌గా "సోషల్ వర్క్ అభ్యర్థులు".
## - ఒక మానవతా దృష్టికోణం, ఆవశ్యకత.

(వేగుచుక్క న్యూస్):

ప్రతి విద్యాసంస్థలో సోషల్ వర్క్ కౌన్సెలర్ ఉండటం కాలానుగుణంగా వస్తున్న మార్పుల్లో ఉండాల్సిన అవసరంగా మారుతోంది. విద్య అనేది కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా, ప్రతి విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని సాధించాలి. అయితే నేటి పోటీ ప్రపంచంలో మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షల ఒత్తిడి కారణంగా విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అదే సమయంలో వారికి అండగా నిల్చునే వారు కరువయ్యారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతుండటం సమాజాన్ని కలచివేస్తున్న అంశం. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఎంతో స్వాగతించాల్సిన అవసరం ఉంది. ఈ నిర్ణయాలు సమాజ ఉన్నతికి పాటుపడుతుందని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ప్రతి 100 మంది విద్యార్థులు ఉన్న విద్యాసంస్థలో తప్పనిసరిగా కౌన్సెలర్ లేదా సైకాలజిస్టును నియమించాలన్న ఆదేశం విద్యార్థుల శ్రేయస్సు దిశగా కీలక అడుగు కానుంది. అయితే ఈ స్థానాల్లో సోషల్ వర్క్ పూర్తి చేసిన అభ్యర్థులను కౌన్సెలర్లుగా నియమించడం వల్ల కలిగే ప్రయోజనాలు చాలా విస్తృతమైనవే కాకుండా చాలా ఫలితాలు, మానవాభివృద్ధి ఫలాలు ఇచ్చేవిగా నిలిచిపోతాయి.

### సోషల్ వర్క్ కౌన్సెలర్‌ల నియామకం వల్ల కలిగే ప్రయోజనాలు

సోషల్ వర్క్ కౌన్సెలర్‌ల నియామకం విద్యా సంస్థలలో విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి అత్యంత అవసరం. సోషల్ వర్క్ చదివిన కౌన్సెలర్‌లు మానవ ప్రవర్తన, కుటుంబ వాతావరణం, సామాజిక సంబంధాలు, మానసిక ఒత్తిళ్ల కారణాలపై లోతైన అవగాహన కలిగి ఉంటారు. క్షేత్రస్థాయి అనుభవాల ద్వారా వారు సమస్యలను గుర్తించి పరిష్కరించే నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారు. వీరు విద్యార్థి సమస్యలను వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా, కుటుంబం, విద్యా సంస్థ, స్నేహితులు, సామాజిక పరిస్థితుల సమగ్ర దృష్టితో విశ్లేషిస్తారు. దీని వల్ల ఒత్తిడి, డిప్రెషన్, భయం, ఆత్మవిశ్వాస లోపం వంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి నివారించడం సాధ్యమవుతుంది.

అలాగే ఆత్మహత్యా భావనలు ఉన్న విద్యార్థులను సకాలంలో గుర్తించి, తల్లిదండ్రులు--ఉపాధ్యాయులతో సమన్వయం చేసి మానసిక మద్దతు అందిస్తారు. వారు విద్యార్థులను మార్కులు, ర్యాంకులకే పరిమితం చేయకుండా, వారి ఆసక్తులు, ప్రతిభ, జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడతారు. ఈ విధంగా సోషల్ వర్క్ కౌన్సెలర్‌లు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతూ, వారిని ఆత్మవిశ్వాసంతో కూడిన, సమాజానికి బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారు.

### విద్యాసంస్థల్లో సోషల్ వర్క్ ప్రాధాన్యత

విద్యాసంస్థ ఒక చిన్న సమాజం లాంటిది. అక్కడ భిన్న సామాజిక, ఆర్థిక నేపథ్యల నుంచి వచ్చిన విద్యార్థులు ఉంటారు. కొందరికి కుటుంబ సమస్యలు, మరికొందరికి ఆర్థిక ఇబ్బందులు, ఇంకొందరికి పోటీ భయం. ఈ సమస్యలను అర్థం చేసుకొని, మానవీయ దృక్పథంతో పరిష్కరించగలిగేది సోషల్ వర్క్ వృత్తి మాత్రమే. సోషల్ వర్క్ కౌన్సెలర్ విద్యార్థిని "పరాజితుడు"గా కాకుండా, సహాయం అవసరమైన వ్యక్తిగా చూస్తాడు. ఈ దృక్పథమే విద్యార్థుల్లో నమ్మకం, భద్రతా భావనను పెంచుతుంది.

### భారతదేశంలో సోషల్ వర్క్ ఆవిర్భావం

భారతదేశంలో సోషల్ వర్క్ వృత్తి 20వ శతాబ్ద ప్రారంభంలో ఆవిర్భవించింది. పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో పాటు పేదరికం, కార్మిక సమస్యలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక సమస్యలు పెరిగిన నేపథ్యంలో ఈ వృత్తి అవసరం ఏర్పడింది. 1936లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ స్థాపనతో సోషల్ వర్క్ విద్యకు వ్యవస్థాత్మక రూపం వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో సోషల్ వర్క్ కీలక పాత్ర పోషించింది. నేడు అదే వృత్తి విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఏర్పడింది.

### సమాజ భవిష్యత్తుకు పునాది

విద్యార్థులే దేశ భవిష్యత్తు. వారి మానసిక ఆరోగ్యం పరిరక్షితమైతేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుంది. విద్యాసంస్థల్లో సోషల్ వర్క్ కౌన్సిలర్లు ఉండటం వల్ల పరీక్షల భయం, గ్రేడ్‌ల ఒత్తిడి, కెరీర్ ఆందోళనలు తగ్గి విద్యార్థులు స్వేచ్ఛగా చదువుపై దృష్టి పెట్టగలుగుతారు. ర్యాగింగ్, వేధింపులు, వివక్ష వంటి సమస్యలను అరికట్టడంలో సోషల్ వర్క్ కౌన్సిలర్లు కీలక పాత్ర పోషిస్తూ, బాధితులకు అండగా నిలిచి స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరుస్తారు. కుటుంబ, ఆర్థిక మరియు వ్యక్తిగత సమస్యల వల్ల వెనుకబడే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందిస్తారు. కేవలం మార్కులకే కాకుండా సానుభూతి, గౌరవం, మానవీయ విలువలను పెంపొందించడంలో వీరు తోడ్పడతారు. ఉపాధ్యాయులు--విద్యార్థుల మధ్య వారధిలా వ్యవహరించి సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తారు.

నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యాసంస్థలో ప్రొఫెషనల్ సోషల్ వర్క్ కౌన్సిలర్ ఉండటం అవసరం. ఇది ఆత్మహత్యల నివారణకే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యారంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.



ఇట్లు
మీ
డా. గాంధారికర్ రమేష్, అధ్యాపకుడు,
సామాజిక శాస్త్ర విభాగం,
ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాల
(స్వయం ప్రతిపత్తి),కామారెడ్డి.

# గతంకంటే అక్రిడిటేషన్లు పెరుగుతాయి.



వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:

- జర్నలిజానికి వన్నెతెచ్చే జర్నలిస్టులకు అండ.
- జీవో 262లో మార్పులు చేస్తాం సమాచార, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి.
- జర్నలిస్టుల సంఘాల భేటీలో హామీ.

జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని.. ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్లోని సచివాలయంలో జీవో 262 పై 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు.. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని చెప్పారు. అన్నింటిని పరిశీలించి జీవో 252లో మార్పులు చేస్తామని హామీనిచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు.. గతలో ఉన్న సుమారు 23 వేల అక్రిడిటేషన్ కార్డుల కంటే ఎక్కువే ఉంటుందన్నారు. దేశంలోనే అక్రిడిటేషన్కార్డుల జారీలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందన్నారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డులు తేడా లేదన్నారు. పాత్రికేయ వ్యవస్థను గాడీలో పెట్టేందుకే ప్రభుత్వపరంగా సర్క్యులేషన్, ఇతర వివరాలను కచ్చితంగా సేకరిస్తామన్నారు. సీఏ సర్టిఫికెట్లను కూడా పరిశీలిస్తామన్నారు. అక్రిడిటేషన్ కమిటీల్లో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామన్నారు. క్రీడా సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పలువురు జర్నలిస్టు సంఘాలు ఇండ్లస్థలాలు, పెన్షన్, బస్ పాసులు, బీమా తదితర అంశాలను ప్రస్తావించగా, మంత్రి పొంగులేటి అన్నీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్వో గుర్రం మల్సూర్, సమాచార శాఖ జెడీ జగన్, ఏడీ యామిని తోపాటు జర్నలిస్టు సంఘాల నాయకులు అల్లం నారాయణ, బి.బసవపున్నయ్య విరాహత్ ఆలీ, కెఎన్.హరి,, మారుతిసాగర్, రాంనారాయణ, తాటికొండ కృష్ణ, శ్రీనివాస్, మస్తాన్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు..

### ఇండ్లస్థలాల సమస్యను పరిష్కరించండి
### మంత్రికి ఫెడరేషన్ విజ్ఞప్తి

జర్నలిస్టు సంఘాల సమావేశంలో పాల్గొన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఇండ్లస్థలాల సమస్యను ప్రస్తావించారు. ఏండ్ల తరబడి ఇండ్లస్థలాల కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, కొత్త విధానం తీసుకొచ్చి జర్నలిస్టులను అదుకోవాలని కోరారు. ఇది సున్నిత సమస్యగా మారిందని గుర్తు చేశారు. హైదరాబాద్ తోపాటు జిల్లా కేంద్రాల్లో ఇండ్లస్థలాలు కేటాయించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్, ఐపీఎస్‌ఈతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అడ్డంకులు లేని విధానాన్ని తీసుకొస్తామన్నారు. తాము ప్రభుత్వంలో అంతర్గతంగా చర్చిస్తున్నామని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సమస్య మళ్లీ మొదటికొచ్చిందన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. జీవో 252ను సవరించి జర్నలిస్టులను న్యాయం' చేయాలని కోరారు. జర్నలిస్టుల మధ్య విభజన వద్దన్నారు. అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. బస్సుపాసులను ప్రత్యేక కలర్ ఇవ్వాలనీ, తద్వారా గుర్తుపట్టేందుకు సుళువుగా ఉంటుందన్నారు. పాత్రికేయ రంగం కొంత పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో అక్రిడిటేషన్ కార్డులు తగ్గించరాదన్నారు. చిన్న పత్రికలకు కార్డులను పెంచాలని అన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్'ను మినహాయించాలి.

- పిఆర్‌సిని వెంటనే ప్రకటించి అమలు చేయాలి.
- పెండిరగ్ బిల్లులు, డి.ఎ.లు వెంటనే విడుదల చేయాలి.
- హెల్త్‌కార్డులు వెంటనే విడుదల చేయాలి.
- టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:





ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్'ను మినహాయించాలనీ, పిఆర్‌సిని వెంటనే ప్రకటించి అమలు చేయాలనీ టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం రాష్ట్ర కార్యాలయం, హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, ప్రత్యేక ఆహ్వానితులు ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు పి.నాగిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.తిరుపతిరెడ్డి, అదనపు ప్రధాన క్యార్యదర్శి ముత్యాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నారాయణమ్మ, డి.శ్రీనివాస్, బి.రాజు, రాష్ట్ర కార్యదర్శులు ఆత్రం భుజంగరావు, రావుల రమేష్, ఎస్. విజయ్, దామెర రాజయ్య, సిద్దోజు కవిత, బోగ రమేష్‌లు పాల్గొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ, 2010 సంవత్సరమునకు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను తప్పనిసరి చేస్తూ, రెండేళ్ళలో టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం నుండి తొలగించాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అశాస్త్రీయమైనవని, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు వచ్చే విధంగా చట్టంలో మార్పులు చేసేందుకుగాను కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లో పిఆర్‌సిని ప్రకటిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ ముగిసి 2 సంవత్సరాలు దాటినప్పటికీ ప్రకటించకపోవడంతో ఉద్యోగ వర్గాలు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పిఆర్‌సిని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ 2024 సంవత్సరం నుండి ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షనరీ ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయుల జిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐ, సరేందర్ లీవు తదితర పెండిరగ్ బిల్లులను, డి.ఎ.లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇన్సురెన్స్ ఇవ్వడం ఆహ్వానించదగినదే ఐనప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు హెల్త్ కార్డులను విడుదల చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన విధానాన్ని అమలు చేయాలి, కెజిబివిలలో కాంట్రాక్టు ఉపాధ్యాయులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఆశ్రమ పాఠశాలలోని పండిట్, పిఈటి పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులకు కామన్ సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో కేంద్రీకృత కిచెన్ ఏర్పాటు ఆలోచనను విరమింపచేసి, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచి నాణ్యమైన భోజనం అందించే చర్యలు చేపట్టాలని కోరారు.


వేగుచుక్క


# 12 వస్తోన్న మనశంకరవరప్రసాద్ గారు

### టిక్కెట్లు ధరల పెంపునకు సర్కార్ గ్రీన్ సిగ్నల్




'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.





# నేను డాక్టర్‌ని.. సిస్టర్‌ను కాను

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ డెబ్యూ మూవీ 'పరాశక్తి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన ఆమె నటించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం కేరళలోని కొచ్చికి శ్రీలీల వెళ్లగా.. అక్కడ జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను ఫ్లర్ట్ చేస్తూ సరదాగా అడిగిన ప్రశ్నలు, దానికి ఆమె ఇచ్చిన క్యూట్ రియాక్షన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను పలకరిస్తూ మీకు తమిళం వచ్చా అని అడగగా, ఆమె అవును వచ్చు అని సమాధానమిస్తుంది. అనంతరం ఆ రిపోర్టర్ శ్రీలీల అందాన్ని పొగుడుతూ.. మిమ్మల్ని మొదటిసారి నేరుగా చూస్తున్నాను, మీరు చాలా అందంగా ఉన్నారు అని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా సిగ్గుపడుతూ నవ్వేశారు. అయితే వెంటనే ఆ రిపోర్టర్ ట్విస్ట్ ఇస్తూ.. మీరు నాకు ఒక సిస్టర్ లాగా అనిపిస్తున్నారు అని అనడంతో, శ్రీలీల తనదైన శైలిలో.. తాను మెడికల్ స్టూడెంట్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. నేను డాక్టర్‌ను, సిస్టర్‌ను (నర్సును) కాదు అంటూ చమత్కరించారు. శ్రీలీల ఇచ్చిన ఈ ఫన్నీ కౌంటర్‌తో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# సంక్రాంతికి అమెజాన్‌లో దండోరా రిలీజ్

తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 14 నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో




నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ.

# ప్రజల జేబులు కొల్లగొట్టిన రాజాసాబ్

### తొలిరోజే 112 కోట్లు వసూళ్లు

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు వసూళ్లపై చిత్రబృందం తాజాగా స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో ఈ సినిమా తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, మరియు కల్కి చిత్రాల తర్వాత ప్రభాస్ ఖాతాలో చేరిన ఆరో రూ. 100 కోట్ల ఓపెనర్ ఇది. దీంతో ఇండియాలో ఈ ఘనత సాధించిన ఏకైక హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 58 కోట్ల వసూళ్లను సాధించగా.. కర్ణాటక / ఇతర రాష్ట్రాలలో రూ. 18 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.36 కోట్లు రాబట్టినట్లు సమాచారం.




# నారీనారీ నడుమ మురారీ వీడియో సాంగ్ విడుదల




ఇద్దరు భామలతో కలిసి శర్వానంద్ ఈ సంక్రాంతికి సందడి చేయనున్నారు. ఆయన ప్రధానపాత్రలో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'ఈ నారీ ఆ నారీ నడుమనే మురారి..' అంటూ సాగే వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా.. అరవింద్ ఆలపించారు. ఈ సినిమాలో శర్వానంద్‌కు జోడిగా సంయుక్త, సాక్షి వైద్య కనిపించనున్నారు.